క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

క్రోసూరు: మండలంలోని దొడ్లేరు గ్రామంలో 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని హసనాబాద్, దొడ్లేరు, ఆవులవారిపాలెం, పెరికపాడు గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈ ఎం.బసవరాజు శుక్రవారం తెలిపారు. విద్యుత్ లైన్లు వేస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. కావున రైతులు , ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

జాతీయ అచీవ్‌మెంట్ టెస్ట్‌కు 967 మంది విద్యార్థులు



అచ్చంపేట: జాతీయ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా అచ్చంపేట మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన అచీవ్‌మెంట్ టెస్ట్‌కు 967 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో నరసింహారావు తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించే సర్వేలో భాగంగా 3,6,9 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. మండలంలో 23 పాఠశాలల్లో ఈ పరీక్ష జరిగిందని చెప్పారు. 3వ తరగతి నుంచి 396 మంది, 6వ తరగతి నుంచి 331 మంది, 9వ తరగతి నుంచి 240 మంది విద్యార్థులు హాజరు కాగా, తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో వేరువేరుగా పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు. పరిశీలకులుగా మాదిపాడు ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం అంకమ్మరావు, తాడువాయితండా హెచ్‌ఎం వెంకటేశ్వరరావు వ్యవహరించినట్లు చెప్పారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో విద్యార్థులను ఎంపికచేయడం జరుగుతుందన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

నకరికల్లు: హెచ్‌ఐవీ గురించి ఆందోళన అవసరం లేదని లింక్ వర్కర్స్ స్కీమ్ జోనల్ సూపర్‌వైజర్ మురికిపూడి విశ్వేశ్వరరావు అన్నారు. ఏపీ శాక్ ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చీమలమర్రిలో గ్రామస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. వైరస్ సోకి హైరిస్క్ ఉన్నవారిని గుర్తించి ప్రభుత్వం ఇచ్చే పౌష్టికాహారం, మందులు అందించడం జరుగుతోందన్నారు. హెచ్‌ఐవీ సోకకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల ఉపేంద్ర, తిరుమలశెట్టి సాంబయ్య, పంచాయతీ కార్యదర్శి కుమార్, లింక్ వర్కర్ దయామణి, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటనెమలిపురిలో 98 మందికి వైద్య పరీక్షలు



రాజుపాలెం: మండలంలోని కోటనెమలిపురి గ్రామ సచివాలయం పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ శుక్రవారం వైద్య సేవలు అందించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రవితేజనాయక్ 98 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 19 మందికి బీపీ, 22 మందికి షుగర్ పరీక్షలు నిర్వహించి 15 రోజులకు మందులను అందించారు. దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రియదర్శిని, ఏఎన్‌ఎంలు రెహెన, రాజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

సత్తెనపల్లి: అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించి ఒక పోలింగ్ బూత్‌లో ఒకే డోర్ నెంబరు కలిగిన ఓటర్ల వివరాలపై బూత్ లెవల్ అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే ఆన్‌లైన్‌లో రీ సర్వే వివరాలు ఎలా నమోదు చేస్తున్నారో పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీఓ డీఎల్ఎస్ రాజకుమారి, తహసీల్దారు ఎస్.సురేష్, సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, బూత్ లెవల్ అధికారులు తదితరులున్నారు.

ఆర్డీవోకు సన్మానం

దాచేపల్లి : గురజాల ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన రమాకాంత్‌రెడ్డిని శుక్రవారం సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో రమాకాంత్‌రెడ్డిని ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మందపాటి రమేష్‌రెడ్డి తదితరులు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జీ కరుణకుమార్, ఎంపీడీవో శోభారాణి, ఎంపీటీసీ ఆకూరి వెంకటరెడ్డి, ముత్యం చెన్నారెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా రూపకల్పన

- నేడు, రేపు నియోజకవర్గంలో స్పెషల్ డ్రైవ్
- జాబితాలో పేర్లపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పులకు అవకాశం



సత్తెనపల్లి: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్నాయి. మరో ఆరు నెలల్లో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకు నోటిఫికేషన్ రానుంది. దీంతో ఇప్పటి నుంచే యంత్రాంగం సంసిద్ధమవుతోంది. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు, అభ్యంతరాలకు తావివ్వకుండా పకడ్బందీగా రూపొందిస్తున్నారు. గత నెల 27న విడుదల చేసిన ముసాయిదా జాబితాను ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రదర్శనకు ఉంచారు. జాబితాపై అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే వాటిని సవరణ చేసే దిశగా అధికారులు కార్యాచరణ రూపొందించారు. నియోజకవర్గంలో 274 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ బూత్‌లో ఒక బూత్ లెవల్ అధికారి (బీఎల్‌వో)ను నియమించారు. ఈ నెల 4, 5 తేదీలలో పోలింగ్ బూత్‌ల వద్ద 2024 ఓటరు ముసాయిదా జాబితాను అందుబాటులో ఉంచుతారు. అక్కడే అభ్యంతాలు ఉంటే రాతపూర్వకంగా స్వీకరిస్తారు. అభ్యంతరాలపై తనిఖీ చేసి వాస్తవమని తేలితే చర్యలు తీసుకుంటారు. ఇందుకోసం నియోజకవర్గ వ్యాప్తంగా 274 మంది బీఎల్‌వోలను నియమించారు. అలాగే మండలానికొక ఏఈఆర్వో చొప్పున నాలుగు మండలాలు, ఒక పట్టణానికి ఐదుగురిని, నియోజకవర్గానికి ఆర్డీవో స్థాయి అధికారిని ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా నియమించారు.

తప్పుడు ఫిర్యాదులు చేస్తే క్రిమినల్ కేసులు...

నియోజకవర్గంలోని పోలింగ్ బూత్ వద్ద ప్రదర్శిస్తున్న ముసాయిదా ఓటర్ల జాబితాపై తప్పుడు అభ్యంతరాలు, తప్పుడు దరఖాస్తులు సమర్పిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నారు. ఎన్నికల మార్గదర్శకాల ప్రకారమే జాబితాను తయారు చేశారు.

18 ఏళ్లు నిండిన వారెవరైనా..

నియోజకవర్గంలో 2,34,442 మంది ఓటర్లుండగా వీరిలో పురుషులు 1,14,976 మంది, మహిళలు 1,19,449 మంది, ఇతరులు 17 మంది ఉన్నారు. ఇప్పటికి ఓటు నమోదు చేసుకోనివారు డిసెంబర్ 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. 2023 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్ల వయస్సు నిండిన వారెవరైనా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. అలాగే 2024, ఏప్రిల్ 1, జూలై 1, లేదా అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండేవారు కూడా ముందస్తు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హులందరికీ ఓటు హక్కు..



అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. ఎన్నికల కమిషన్ ఆదేశాలకనుగుణంగా ఓటరు జాబితాల పరిశీలన రాజకీయ నాయకుల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. ఓటు హక్కు పొందేలా అందరికీ తెలియజేశేలా సచివాలయ స్థాయిలో జాబితాలు ప్రదర్శించాం. 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలి. శని, ఆదివారం ప్రతి పోలింగ్ బూత్ వద్ద బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారు.

– బీఎల్ఎస్ రాజకుమారి, ఆర్డీవో, సత్తెనపల్లి

భూమి కోల్పోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం

జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాద్



ముప్పాళ్ళలో రైతులతో మాట్లాడుతున్న జేసీ శ్యామ్‌ప్రసాద్, ఆర్డీవో రాజకుమారి

ముప్పాళ్ళ: జాతీయ రహదారి నిర్మాణంలో భూమి కోల్పోయే రైతులందరికీ నష్టపరిహారం అందిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాద్ చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం రైతు భరోసా కేంద్రంలో కొండమోడు–పేరేచెర్ల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న మాదల, ఇరుకుపాలెం గ్రామాల రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందించటం జరుగుతుందన్నారు. ఏమైనా సందేహాలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. ప్రభుత్వం అందించే నష్టపరిహారానికి, బహిరంగమార్కెట్‌లో భూమికి లభించే ధరకు చాలా వ్యత్యాసం ఉందని వీలైనంత మేర సాయం ఎక్కువ అందేలా చూడాలని రైతులు కోరారు. తన పరిధిలో రైతులకు అండగా ఉంటానని, ప్రభుత్వం నిర్దేశించిన మేరకు నష్టపరిహారం అందిస్తామని చెప్పారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. భూ సేకరణ సమయంలో ఏమైనా సమస్యలు తలెత్తితే నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. సమావేశంలో సత్తెనపల్లి ఆర్డీవో రాజకుమారి, తహసీల్దార్ ఎం.భవానిశంకర్, జిల్లా సర్వేయర్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాద్, మండల సర్వేయర్ శ్రీకాంత్, ఎన్‌హెచ్ఏఐ సిబ్బంది, ఆయా గ్రామాల వీఆర్వోలు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

'సీస్' పరీక్షకు 877 మంది విద్యార్థులు



పరీక్ష కేంద్రం పరిశీలిస్తున్న ఎంఈవో నూనె ప్రసాద్

నకరికల్లు: మండలంలో 3,6,9 తరగతి విద్యార్థులకు సీస్ పరీక్ష నిర్వహించినట్లు ఎంఈవో ఎన్.ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఆయా పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడో తరగతి చదువుతున్న విద్యార్థులు 14 పాఠశాలల్లో, ఆరో తరగతి విద్యార్థులకు 13 పాఠశాలల్లో, 9వ తరగతి విద్యార్థులకు 11 పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించగా, మొత్తం 877 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. విద్యా వ్యవస్థ బలం, బలహీనత అంచనాతోపాటు లోపాలు గుర్తించడం, తరగతి గదిలో విద్యాభ్యాసనలో తోడ్పాటు, ఉపాధ్యాయులు వృత్తిపరమైన, అభ్యసన లక్ష్యాలను చేరుకోవడం తదితర ప్రయోజనాల దృష్ట్యా విద్యా శాఖ ఈ పరీక్ష నిర్వహిస్తోందన్నారు. పరీక్షల వల్ల విద్యార్థులు మరింతగా రాణిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్ బి.మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెట్ట పరిస్థితుల్లో చిరుధాన్యాలు సాగు చేయాలి



మాదలలో మిరప పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, ఏఓ అరుణ

మాదల(ముప్పాళ్ళ): ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా నీటి వసతికి అనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి చెప్పారు. మండలంలోని మాదల గ్రామంలో మిరప, వరి, శనగ పంటలను శుక్రవారం పరిశీలించారు. ప్రస్తుత బెట్ట పరిస్థితుల నేపథ్యంలో 2%యూరియా, పొటాషియంనైట్రేట్ 2.5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి వారం రోజులకు ఒకసారి పిచికారీ చేస్తే మొక్కకు బెట్టను తట్టుకునే శక్తి వస్తుందన్నారు. 40 శాతం సబ్సిడీపై మండలంలో వెయ్యి క్వింటాళ్ల శనగ విత్తనాలు అందించామని, సాగు చేసిన రైతులు ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. నీటివసతి ఉన్న రైతులు మొక్కజొన్న, జొన్న, నీటి వసతిలేని రైతులు శనగ, చిరుధాన్యాలు సాగు చేసుకోవచ్చన్నారు. పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేసుకొని ఉండాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, వ్యవసాయ సహాయకులు బి.వి.నారాయణ, ఉద్యానవన శాఖ సహాయకులు కె.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి వైఎస్సార్ బీమా



బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సత్తెనపల్లి: మండలంలోని భీమవరం గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన బంకా మరియన్న భార్య బంకా రాధకి వైఎస్సార్ బీమాలో భాగంగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు శుక్రవారం అందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాలేటి పిచ్చయ్య, మానకొండ భూపతిరావు, గ్రామ వెల్ఫేర్ సెక్రటరీ రాజ్యలక్ష్మిలు బాధిత కుటుంబానికి నగదు అందజేశారు.

ఆదర్శ పాఠశాలను సందర్శించిన ఫుడ్ కమిటీ చైర్మన్



ఆదర్శ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీ ఫుడ్ కమిటీ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి

కారెంపూడి: రాష్ట్ర ఫుడ్ కమిటీ చైర్మన్ చిట్టా విజయ ప్రతాప్‌రెడ్డి శుక్రవారం కారెంపూడిలోని ఆదర్శ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న ఆహారంపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని తెలుసుకున్నారు. విద్యార్థులు భోజనం బాగానే పెడుతున్నారని చెప్పారు. ఇంటి దగ్గర నుంచి భోజనం తెచ్చుకుంటున్న వారి గురించి అడుగగా, లేరని విద్యార్థులు తెలిపారు. హాస్టల్‌లో భోజనం గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని ఇదే విధంగా విద్యార్థులకు పెట్టించాలని ప్రిన్సిపాల్ ఎస్ నయోమికి సూచించారు. ఉదయం 10.30 గంటలకు పాఠశాలకు ఆయన తనిఖీకి వచ్చారు. అనంతరం మండలంలోని మిరియాల గ్రామంలోని ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారులు ఆరోగ్యంగా ఎదగడానికి ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సక్రమంగా పెట్టాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందుతున్న పోషకాహారం గురించి కూడా ఆరా తీశారు. తహసీల్దార్ జి.శ్రీనివాసయాదవ్ ఆయన వెంట ఉన్నారు. ఇదిలా ఉంటే ఫుడ్ కమిటీ చైర్మన్ రాకతో రేషన్ డీలర్లు సంబంధిత సంస్థల ప్రతినిధులు అలర్ట్ అయ్యారు. కాని మిరియాల అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ అనంతరం మాచర్ల తరలివెళ్లారు.

అనుమానాదస్పద స్థితిలో వ్యక్తి మృతి



నకరికల్లు: అనుమానాదస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. వీఆర్వో చింతిరాజ్ యువరాజ్ ఫిర్యాదు మేరకు చల్లగుండ్ల అడ్డరోడ్డులోని అభయాంజనేయస్వామి దేవస్థానం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతుని పక్కన టీఎస్05 ఎస్ఎస్ 3156 నంబరు బజాజ్ ప్లాటినా ద్విచక్ర వాహనంతోపాటు బ్యాగు ఉందన్నారు. అతని పర్సు, వాహనం సీ బుక్ ఆధారంగా మృతుడు రూపాని రాజు (38)గా గుర్తించినట్లు వెల్లడించారు. మృతుడు నల్గొండ జిల్లా భీమవరం గ్రామానికి చెందిన వ్యక్తిగా ఆధారాలు లభించాయన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విఘ్నేశ్వర, నంది విగ్రహాలకు కళాభికర్షణ



విఘ్నేశ్వర విగ్రహానికి కళాభికర్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మేకల హనుమంతరావు

అమరావతి: స్థానిక గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి ఆలయంలో విఘ్నేశ్వర, నంది విగ్రహాలకు స్థాన మార్పిడి చేసి పునఃప్రతిష్ఠ చేయటానికి శుక్రవారం కళాభికర్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు, వేద పండితులు పుణ్యాహవాచన, నవగ్రహ మండపారాధన, కళాభికర్షణ హోమం చేశారు. అనంతరం ప్రస్తుత స్థానాల నుంచి కళాభికర్షణ చేసి విగ్రహాలను కదిలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకల హనుమంతరావు, డిప్యూటీ తహసీల్దార్ సునీత దేవాలయ ప్రతినిధి తాడిబోయిన శ్రీనివాసరావు, దేవాలయ ఈవో పూర్ణచంద్రరావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయండి



ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయాలని కరపత్రాలను చూపుతున్న సీపీఎం నాయకులు

అమరావతి: ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయాలని శుక్రవారం సీపీఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆర్టీసీ బస్టాండ్ సత్తెనపల్లి సెంటర్ ఆటోనగర్ ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు బస్సు జాతాలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ఈ నెల 15న విజయవాడ నగరంలో ప్రజారక్షణ భేరి పేరుతో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ భారీ బహిరంగసభలో సీపీఎం జాతీయ కార్యదర్శి కామ్రేడ్ ఏచూరి సీతారాం, బి.వి.రాఘవులు తదితర నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని అన్నారు. కలవరపరుస్తున్న దేశ ప్రజల ఆర్థిక స్థితులను, రాష్ట్ర విభజన హామీలను కేంద్ర బీజేపీ ప్రభుత్వం అమలు చేయకుండా మోసం చేసి రాష్ట్రాన్ని దివాలా తీయించిందీ.. ఈ సభలో విశ్లేషిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మొహిద్దీన్‌వలి నందూరి వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు

బాలికలు ఆరోగ్యంగా ఉండాలి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి



బంగారు తల్లి గురించి వివరిస్తున్న సూపర్‌వైజర్ రత్నకుమారి

గురజాల : బాలికలు ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ వై.రత్నకుమారి విద్యార్థులకు సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలోని ప్రభుత్వ పాఠశాలలో బంగారు తల్లి కార్యక్రమం ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు శుక్రవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు చదువులోనూ, క్రీడల్లోనూ ముందుడాలన్నారు. ఆరోగ్యపరంగా విద్యార్థులు ఏ గ్రేడ్‌లో ఉండాలన్నారు. మంచి పోషకాలతో కూడిన ఆహారం తీసుకుని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు రక్తహీనతతో ఇబ్బందులు పడకుండా మంచి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

వివిధ కారణాలతో వెళ్లిపోయిన పిల్లలు తల్లిదండ్రులకు అప్పగింత



బీసీ హాస్టల్ నుంచి వెళ్లిపోయిన విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్‌ఐ

రాజుపాలెం: వివిధ కారణాలతో ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయిన నలుగురు విద్యార్థులను ఎస్‌ఐ ఎం నారాయణ, పోలీసు సిబ్బంది వెతికి పట్టుకుని శుక్రవారం వారి తల్లిదండ్రులకు అప్పగించారు. మండల కేంద్రంలోని రాజుపాలెం బీసీ హాస్టల్లో ఉండి జెడ్పీ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న బత్తుల మహేష్(13), మద్దు ప్రేమ్‌కుమార్(15)లు అక్టోబర్ 30వ తేదీన హాస్టల్ నుంచి వెళ్లిపోయారు. అదేవిధంగా అనుపాలెం గ్రామానికి చెందిన వేల్పుల వెంకటేశ్వర్లు(14), అక్టోబర్ 24వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కొండమోడు అనాథాశ్రమంలో చదువుతున్న వెంకట యలమందను హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ ఏరియాలో పోలీసులు గాలించి పట్టుకున్నారు. ఈ నలుగురిని ఎస్‌ఐ నారాయణ వారి తల్లిదండ్రులకు అప్పగించారు. వెతికి పట్టుకున్న సిబ్బందిని సత్తెనపల్లి సీఐ ప్రేమ్‌కుమార్ అభినందించారు.

ఓటర్ల నమోదుపై సమీక్ష సమావేశం



బూత్ లెవల్ ఆఫీసర్ల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జీవీ రమాకాంత్‌రెడ్డి

పిడుగురాళ్ల: ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని గురజాల ఆర్డీవో జీవీ రమాకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్‌లో బూత్ లెవల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎల్‌వోలు ఎప్పటికప్పుడు ప్రజలకు ఓటర్ల నమోదు గురించి తెలియజేయాలన్నారు. ఈ నెల 4, 5 తేదీలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాల గురించి కొత్తగా ఓట్లు నమోదు చేయించుకునేవారు, చేర్పులు, మార్పులు, అడ్రస్ మార్పులు చేయించుకునేవారికి తెలియజేయాలన్నారు. ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా బీఎల్‌వోలు కృషి చేయాలన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్‌వో)లు కఠినంగా వ్యవహరించాలని, తప్పులు లేకుండా జాగ్రత్త వహించాలని ఆయన తెలియజేశారు. ఎవరికైనా సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని వాటిని పరిష్కరించే విధంగా అడుగులు వేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్‌వోలు కేఎస్ చక్రవర్తి, ఎ.వెంకటేశ్వర్లు తదిరతులు పాల్గొన్నారు.

కనమర్లపూడిలో ప్రతిష్టకు సిద్ధమవుతున్న ఆలయాలు



పోలేరమ్మ దేవాలయం వద్ద ఏర్పాట్లు పర్యవేక్షణ చేస్తున్న గ్రామస్తులు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో నూతన దేవాలయాల ప్రతిష్ఠ కార్యక్రమాలకు రంగం సిద్ధం చేస్తున్నారు. సంగుపోట్ల హరినాథ్ శర్మ సారథ్యంలో ఈ నెల 7వ నుంచి 9వ తేదీ ప్రతిష్ఠ చేయనున్న గ్రామదేవతల పోలేరమ్మ, అద్దంకమ్మ, గంగమ్మ, పెద్దమ్మ, కనకమ్మ, మహాలక్ష్మమ్మ, నూతన దేవాలయాలు నిర్మాణ పనులు పార్టీలకు అతీతంగా గ్రామస్తులు దాతలు సహకారంతో తుదిదశకు చేరా యి. సుమారు రూ. 40 లక్షల వ్యయంతో ఈ నిర్మాణం చేపట్టారు. పాలాల్లో ఏర్పాటు చేసిన దేవాలయాలకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ పనులు పూర్తి చేశామన్నారు. పోలేరమ్మ దేవాలయం ప్రాంగణంలో ప్రతిష్ఠ వేడుకలకు సంబంధించి యజ్ఞశాల కూడా ఏర్పాటు చేశారు.

నేడు బహిరంగ ప్రజావేదిక

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీ 15వ విడత సామాజిక తనిఖీలలో భాగంగా శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాయలంలో బహిరంగ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఉపాధి పథకం ఏపీవో జయచంద్రకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1 2022 నుంచి 31 మార్చి 2023 వరకు గ్రామాలలో చేపట్టిన ఉపాధిహామీ పనులు, వెలుగు పథకం, పంచాయతీరాజ్ శాఖ, గ్రామాణాభివృద్ధి శాఖ ద్వారా చేపట్టిన పనులు, ఉద్యాన శాఖ ద్వారా చేసిన పనులపై, సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ తదితర అంశాలపై 2023 అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3 వరకు గ్రామ సభలు నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ ప్రజావేదికలో మండలంలోని ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొనాలని ఆయన కోరారు.

మిరపకు బెట్ట వాతావరణాన్ని దూరం చేయాలి

రైతులకు సూచించిన ఉద్యానశాఖాధికారి



రైతులకు సూచన చేస్తున్న నవీన్‌కుమార్

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు, అలవాల గ్రామాల్లో ఉద్యాన శాఖ అధికారి నవీన్ కుమార్ శుక్రవారం మిరప పొలాలను పరిశీలించారు. వర్షాభావ పరిస్థితుల వలన ఎక్కువ ప్రాంతంలో బెట్ట వాతావరణం నెలకొందన్నారు. మిరప పంట బెట్ట వాతావరణాన్ని అధిగమించేందుకు ఫ్యూమిక్ యాసిడ్ వాడాలని సూచించారు. యాసిడ్ అందుబాటులో లేని పక్షంలో 14.035 స్ప్రే పొటాష్, 19.19.19 లలో ఏదో ఒకదానిని లీటర్ నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. డిప్ పద్ధతి ద్వారా నీటియాజమాన్య పద్ధతులను చేపటితే ఎక్కువ నీటిని ఆదా చేసుకోవచ్చాన్నారు. నీటి ద్వారా సంక్రమించే తెగుళ్లను కూడా అధికమించవచ్చు అని సూచించారు. కలుపు ప్రభావం కూడా తక్కువగా ఉంటుందన్నారు. ప్రస్తుత తరుణంలో పంటలు అన్ని ఇంబ్బందులు లేకుండా ఉన్నాయని, కనీస జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులను సాధించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి. విజయభాస్కర్, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పి. అగస్టిన్, ఎస్. రమేష్, టి. కళ్యాణ్‌బాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పేటలో రూ.70 వేల నగదు చోరీ

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీలోని ఓ ఇంట్లో రూ. 70 వేలు చోరీకి గురైంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కె సీత కుమారుడితో కలసి ఎన్‌టీఆర్ కాలనీలో నివాసం ఉంటోంది. గురువారం ఉదయం 9.30 గంటలకు వ్యక్తిగత పనిమీద విజయవాడకు వెళ్లింది. తిరిగి శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి తలుపు పగలగొట్టి ఉండటం గమనించి, ఇంటిలోపల బీరువాలో ఉంచిన రూ. 70 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించింది. శనివారం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడికి తప్పిన ప్రమాదం

నాదెండ్ల: జాతీయ రహదారిపై యువకుడికి ప్రాణాపాయం తప్పింది. చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపునకు ద్విచక్ర వాహనంపై యువకుడు వెళ్తున్నాడు. గణపవరం శివప్రియనగర్ సమీపంలో రహదారి మరమ్మతుల్లో భాగంగా రాళ్ళు రోడ్డుపై పడటంతో ద్విచక్రవాహనం రాయిపైకి ఎక్కి అదుపు తప్పింది. దీంతో యువకుడు రోడ్డుపై పడ్డాడు. అదే సమయంలో వెనుక నుంచి కారు వేగంగా వస్తు అప్రమత్తపై సడన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో ప్రమాదం తప్పింది. స్వల్పగాయాలపాలైన యువకుడిని ఆసుపత్రికి తరలించారు.